# బీఆర్ఎస్‌తోనే సుస్థిర పాలన



కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- అభివృద్ధికి ఆకర్షితులై గులాబీ గూటికి..
- ముచ్చటగా మూడోసారి గెలుపు తథ్యం
- ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు
- బీఆర్ఎస్‌లో చేరిన పలువురు నేతలు

ఉప్పునుంతల, అక్టోబర్ 31: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లోకి వలసలు వస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తరాం నగర్‌కు చెందిన 25మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భం గా గువ్వల మాట్లాడుతూ 50ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏమాత్రం అభివృద్ధి జరగలేదని, మళ్లీ మాయమాటలతో ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలను నమ్మకుండా ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌ను గెలిపించు కోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సుస్థిర పాలన అందుతుందని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీను, రాజు పాల్గొన్నారు

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

అమ్రాబాద్/అచ్చంపేట రూరల్, అక్టోబర్ 31 : నల్లమల ప్రాంతమైన అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో వివిధ పార్టీల నేతలు బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో పదర మండలంలోని చిట్లంకుంట గ్రామానికి చెందిన 25 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన మాకు కనీస గుర్తింపు లేక పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా అచ్చంపేట మండలం రంగాపూర్, చెన్నారం, సింగారం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు విప్ గువ్వల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# వారంటీ లేని గ్యారెంటీలునమ్మొద్దు

- కాంగ్రెస్ మాయమాటలు వింటే గోసపడతాం
- గులాబీ పార్టీని ఆదరిస్తే మరింత అభివృద్ధి
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- మాడ్గుల మండలంలో ప్రచారం..
- కల్వకుర్తిలో మైనార్టీలతో ఆత్మీయ సమ్మేళనం



మైనార్టీల సమ్మేళనంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మాడ్గుల, అక్టోబర్ 31 : వారెంటీ లేని పార్టీ చెప్పే గ్యారెంటీలను నమ్మొద్దని, కాంగ్రెస్ మాయమాటలు నమ్మితే మరోసారి మోసపోయి గోసపడతామని బీఆర్ఎస్ అభ్యర్థి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండలంలోని అన్నెబోయిన్‌పల్లి, సుద్దపల్లి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మేజార్టీతో గెల్పించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నెబోయిన్‌పల్లి వాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశామన్నారు. అన్నెబోయిన్‌పల్లి నుంచి సాగర్ రోడ్డు వరకు బీటీ రోడ్డు వేశామన్నారు. ప్రతి గల్లీకి సీసీ రోడ్లు వేశామన్నారు. 40 మందికి గృహలక్ష్మి కింద ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. సుద్దపల్లి వాగు బ్రిడ్జికి రూ.92 లక్షలు, మండలానికి 800 గృహలక్ష్మి ఇండ్లు, దళితబంధు 300 కుటుంబాలకు మంజూరు చేశామని గుర్తు చేశారు. రూ. 25 లక్షలతో గుడి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే వృద్ధులకు రూ.3వేల నుంచి 5వేలు, దివ్యాంగులకు రూ.6 పింఛన్ అమలులోకి వస్తుందని, రైతుబంధు కూడా రూ.16 వేలకు చేరుతుందని వివరించారు. అదేవిధంగా మహిళలకు రూ.3వేలతోపాటు రూ.400కే సిలిండర్ అందిస్తుందని చెప్పారు. ఇప్పటికే ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి సాగు నీరు అందిస్తామన్నారు. మూడో సారి బీఆర్ఎస్ విజయం సాధించడం కాయమని, ఈ ఎన్నికల్లో సెంచరీ కొట్టడం ఖాయమన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ కింద తండాలలో బీటీ రోడ్ల కోసం రూ.100 కోట్లు ప్రభుత్వం మంజూరు ఇచ్చిందన్నారు. ఇలా అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరించి కల్వకుర్తిపై గులాబీ జెండా ను ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలోని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్ రెడ్డి, సర్పంచ్ పోలే యాదయ్య, ఎంపీటీసీ చంటి, ఉప సర్పంచులు శేఖర్‌గౌడ్, సంజీవరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ కల్లు రాజవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, ధర్మరెడ్డి, యాదిరెడ్డి, లాలయ్యగౌడ్, జంగయ్య యాదవ్, జార్జిరెడ్డి, భుపతిరెడ్డి, రాజుగౌడ్, చలమందగౌడ్, అనిల్, నిరంజన్‌జీ, వరున్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 31 : దేశంలో ఎక్కడా లేని విధంగా పూర్తి స్థాయిలో మతాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా సెక్యులర్ విధానాలను అవలంబిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులు మైనార్టీలకు వెలగబెట్టిందేమిలేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీటవేస్తూ వారికి షాదీ ముబారక్, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, విదేశాలలో విద్యాభ్యాసానికి చేయూతనందిస్తోందని వివరించారు. కాంగ్రెస్ బీజేపీలకు ఓటు వేయడం ద్వారా రాష్ట్రంలో మతకల్లోలాలు, దౌర్జన్యాలు, సంక్షేమం కుంటుపడుతుందని అందుకే అందరూ బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కాగా పలువురు మైనార్టీ నాయకులు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంఐఎం ఉమ్మడి జిల్లాధ్యక్షుడు జాబిన్‌బిన్ సయ్యద్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు జావీద్, కల్వకుర్తి అధ్యక్షుడు సత్తార్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహేద్, మాజీ చైర్మన్ శ్రీశైలంతోపాటు మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## గుర్రపు బగ్గితో ప్రచారం..



తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా మర్రి జనార్దన్‌రెడ్డి గెలవాలని తిమ్మాజిపేటకు చెందిన నిరంజన్ గుర్రపు బగ్గి వేసుకొని వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నాడు. గుర్రంతోపా టు బగ్గికి గులాబీ రంగు వేసి ప్రచారం నిర్వహిస్తుండడంతో అందరూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. - తిమ్మాజిపేట, అక్టోబర్ 31



సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రాంభూపాల్‌రెడ్డి, లోకారెడ్డి

## గులాబీగూటికి వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర నేతలు

- పార్టీలోకి ఆహ్వానించిన సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని స్పష్టం

పెంట్లవెల్లి, అక్టోబర్ 31 : కొల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్‌లోకి స్వచ్ఛందంగా చేరుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని మంచాలకట్ట గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర నాయకులు రాంభూపాల్‌రెడ్డి, లోకారెడ్డి(మాజీ జెడ్పీటీసీ) మంగళవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో 70 ఏండ్లలో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ పదేండ్లలో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేశారని కొనియాడారు. కొల్లాపూర్‌లో 19 ఏండ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న జూపల్లి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేగా బీరం గెలిచిన అనతి కాలంలోనే కొల్లాపూర్ నియోజకవర్గానికి సాగునీరు అందించడంతోపాటు అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధికి పరితపించే నాయకుడు బీరం అని, ఆయనను రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో గోప్లాపురం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన నాగం అనుచరులు

తాడూరు, అక్టోబర్ 31 : హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం సీఎం కేసీఆర్ సమక్షంలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన వెంట మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున చేరుకున్న నాయకులు, కార్యకర్తలు కూడా నాగం ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నాగం జనార్దన్‌రెడ్డి కార్యకర్తలతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు ఇచ్చిన మాట ప్రకారం బీఆర్ఎస్ పార్టీలో చేరామన్నారు. కలిసికట్టుగా పని చేసి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని భారీ ఎత్తున గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో మండల మాజీ జెడ్పీటీసీ బాలగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మయ్య, గుంతకోడూరు మాజీ సర్పంచ్ వెంకటయ్యతోపాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



నాగం జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

## అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి : ఎమ్మెల్యే మర్రి

బిజినేపల్లి, అక్టోబర్ 31: బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి చూసి వివిధ పార్టీల నాయలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రధానంగా గ్రామానికి చెందిన జోసెఫ్‌రెడ్డి, కొణిదెల ఈదన్న, కొడిదల సాగర్, చిన్నఖాజా, మల్లేశ్, సత్తన్న, తిరుపతయ్య, అశోక్, గంగ, భీమయ్య, శివ, నాని, సుల్తాన్, రమేశ్, రవితోపాటు 15 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పులేందర్ రెడ్డి, మహేశ్వరరావు, వినయ్‌రావు, పలువురు ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు ఉన్నారు.

## ఎమ్మెల్యే గువ్వలకు డాక్టరేట్ పట్టా

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 31: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన 83వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ వైస్ చాన్సులర్ రవీందర్ కుమార్, తెలంగాణా రాష్ట్ర గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. న్యాయశాస్త్రంలో డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్ల పర్యవేక్షణలో " భారతదేశంలో శాసన సభ్యుల శాసన అధికారాలు వాటిపై న్యాయ సమీక్ష " అనే అంశంపై పర్యవేక్షణ చేసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అడోబ్ కంపెనీ సీఈవో శాంతన్ నారాయణ్ చేతుల మీదుగా ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్వీకరించారు.